సాక్షి
వికారాబాద్

ఆదివారం । 26 । జనవరి । 2025



అంతా ప్రశాంతమే..

తాండూరు మున్సిపల్ అభివృద్ధే ధ్యేయమని, వ్యక్తిగత దూషణలకు వేదిక కారాదని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



పరిగి చుట్టూ ఔటర్

పరిగి చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేసి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



కూలీలు దొరకట్లే!

యాసంగి వరినాట్లు వేసేందుకు కూలీలు దొరక్క దౌల్తాబాద్ మండలంలోని రైతులు అవస్థలు పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

గణతంత్ర శుభాకాంక్షలు



అనంతగిరి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలకు మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ గణతంత్ర దినోత్సవం రోజు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం నాలుగు పథకాలను అమలు చేయబోతోందని తెలిపారు. ప్రజలంతా ప్రభుత్వం అందించే అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హక్కులపై అవగాహన ఉండాలి
ప్రిన్సిపల్ జిల్లా జడ్జి శ్రీనివాస్‌రెడ్డి



ఖైదీలకు హక్కులపై అవగాహన కల్పిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాస్‌రెడ్డి

పరిగి: జైలు జీవితం గడుపుతున్న ఖైదీలు వారికి ఉన్న ప్రాథమిక హక్కులపై అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. శనివారం పరిగి సబ్ జైల్ జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ఖైదీలకు హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షణికావేశంలో చేసిన తప్పులకు కుటుంబం మొత్తం క్షోభ పడుతుందని అన్నారు. ఆర్థిక స్థోమత లేని పేద ఖైదీలకు జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచితంగా డిఫెన్స్ లాయర్‌ను ఇవ్వడంతో పాటు బెయిల్ ఇవ్వడం జరుగుతుందన్నారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఖైదీలకు ఎలాంటి సందేహాలు ఉన్నా లీగల్ సర్వీస్ అథారిటీకి తెలియజేసి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీస అథారిటీ చైర్మన్ శీతల్, పరిగి జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప, డీఎస్పీ శ్రీనివాస్, జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, లీగల్ డిఫెన్స్ న్యాయవాదులు రాము, శ్రీనివాస్, వెంకటేష్, గౌస్‌పాష, రవికుమార్, భాగ్యలత, ఎస్సై సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల భూములు లాక్కుంటే సహించేది లేదు

శంకర్‌పల్లి: మండలంలోని కొండకల్ తండాలో పలు ప్రైవేట్ కంపెనీలు గిరిజనుల భూములు అక్రమంగా లాక్కోవడం అన్యాయమని, అలాంటి వారిపై ఉక్కుపాదం మోపాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. కొండకల్ తండాలో గిరిజనులు చేపడుతున్న నిరసనలకు శనివారం ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజనుల పొట్ట కొడితే చూస్తూ ఊరుకునే వారు ఎవరూ లేరని హెచ్చరించారు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించాలని, న్యాయబద్ధంగా గిరిజనులకు రావాల్సిన భూములను వారికి దక్కేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, న్యాయవాది కృష్ణ, తండావాసులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

చేవెళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ఆరు గ్యారంటీల హామీలు అమలు కావడం లేదని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండాగా పనిచేస్తున్న సీపీఐకి ప్రజల నుంచి పూర్తి మద్దతు లభిస్తోందని చెప్పారు. పార్టీ వంద వసంతాల వేడుకల్లో భాగంగా ఈ నెల 28న చేవెళ్లలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరు కానున్నట్టు చెప్పారు. సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.

కీర్తి కిరీటాలు

వివిధ రంగాల్లో విశేషంగా రాణిస్తున్న ఉమ్మడి జిల్లా వాసులు

- స్వయం స్వావలంబన దిశగా అడుగులు
- దేశ రక్షణలో ఆదర్శంగా నిలుస్తున్న యువకులు
- గణతంత్ర భారతావనిలో నునంవన్న మార్పులు

76 ఏళ్ల గణతంత్ర భారతావనిలో ఎన్నో విజయాలు.. కీర్తి కిరీటాలు.. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు.. ఇలా చెప్పుకొంటూ పోతే కోకొల్లలు.. రక్షణ, సేవ.. స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తున్న పలువురు మిగిలిన వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. పలు గ్రామాలకు చెందిన యువకులు సైన్యంలో చేరి దేశ రక్షణలోనే కాకుండా అంతర్జాతీయ సేవలు అందిస్తూ మన్ననలు పొందుతున్నారు. వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తున్న మహిళలు తామెవరికీ తీసిపోమని చాటిచెబుతున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

సాక్షి ఎక్స్‌క్లూజివ్


దేశ రక్షణలో 'పెద్ద'మంగళారం



నేతాజీ విగ్రహానికి సెల్యూట్ చేస్తున్న విశ్రాంత ఆర్మీ జవాన్లు

మొయినాబాద్: మండలంలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన 20 మంది ఆర్మీలో పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన కొండా వెంకటరంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొండా లక్ష్మారెడ్డి, చిరాగ్ ప్రతాపలింగంగౌడ్ ఈ గ్రామ వాసులే. సిద్ధాంతి రామస్వామిగౌడ్, సిద్ధాంతి లక్ష్మయ్యగౌడ్, పొన్న హరిబాబు, పాటి రామ్‌రెడ్డి, బులించెరువు కృష్ణారెడ్డి, పొన్న ప్రభాకర్, కరికె పాండుకుమార్, చేగూరి వీరస్వామిగౌడ్, కరిక యాదయ్య, బద్దం ప్రతాప్‌రెడ్డి, కమ్మరి కృష్ణ, చెరుకుపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మండడి రంగారెడ్డి, మండడి రాంచంద్రారెడ్డి, కావలి లక్ష్మీనారాయణ, సిద్ధాంతి రాజుగౌడ్, వెంకటరామిరెడ్డి, అనిల్‌కుమార్, కరికె శ్రీశైలం, బులించెరువు వీరేందర్‌రెడ్డి భారత సైన్యంలో చేరి సేవలందించారు. ప్రస్తుతం వీరేందర్‌రెడ్డి ఒక్కరే ఆర్మీలో పనిచేస్తున్నారు. మిగిలిన వారంతా ఉద్యోగ విరమణ పొందారు. వీరిలో సిద్ధాంతి రామస్వామిగౌడ్, సిద్ధాంతి లక్ష్మయ్యగౌడ్, పొన్న హరిబాబు, పాటి రామ్‌రెడ్డి రిటైర్ అయిన తరువాత మరణించారు. విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు గత ఏడాది గ్రామంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ఢిల్లీలో పార్లమెంట్ భవనం ముందు ప్రాణత్యాగం చేసిన మండడి యాదిరెడ్డి సైతం పెద్దమంగళారం గ్రామ వాసే.

ఆర్మీ అడ్డా.. అగ్గనూరు



అగ్గనూరు గ్రామం వ్యూ

యాలాల: అగ్గనూరు.. ఈ గ్రామం పేరు వింటే గుర్తుకు వచ్చేది ఆర్మీ జవాన్లే.. ఒక్క సైనికులే కాదు గ్రామం నుంచి పోలీసులు, ఉపాధ్యాయులు, డాక్టర్లుగా రాణిస్తున్నారు. అగ్గనూరు గ్రామ జనాభా సుమారు రెండు వేలు. ఆర్మీలో చేరేందుకు యువత ఎక్కువగా ఆసక్తి చూపుతారు.. ఇందుకు కారణం లేకపోలేదు. గతంలో భారత సైన్యంలో పని చేసిన వారు యువతను ఆ దిశగా ప్రోత్సహిస్తారు.. ప్రస్తుతం గ్రామం నుంచి 20మంది దేశ రక్షణలో పాలుపంచుకుంటున్నారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత సివిల్ పోలీసులుగా పని చేస్తున్న వారు కూడా ఉన్నారు.



మిలటరీ ఆస్పత్రి వద్ద ఆర్మీ జవాను హన్మంతు

"దేశం కంటే ఏదీ ఎక్కువ కాదు



దేశ భద్రత, సేవల కోసం ఆర్మీని ఎంచుకున్నా. ప్రస్తుతం ఫరీద్‌కోట్ మిలటరీ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నా.. కుటుంబానికి, స్నేహితులకు, పండుగలకు దూరంగా ఉంటున్నా.. అవేవీ దేశ సేవ కంటే ఎక్కువ కాదనిపిస్తుంది. మా గ్రామం నుంచి పదుల సంఖ్యలో ఆర్మీలో చేరడం సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో మరింత మంది చేరుతారని భావిస్తున్నా.

– హన్మంతు, ఆర్మీ జవాను

గొప్పగా ఫీలవుతా



దేశ రక్షణలో భాగస్వామి కావడం ఎంతో గొప్పగా ఫీలవుతా. సరిహద్దులో కాపలా కాస్తూ స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం గొప్ప అనుభూతినిస్తుంది.. భరత మాత రుణం తీర్చుకునే అవకాశం మాకు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. దేశ సేవలో మా గ్రామ యువత ముందుండడం ఆనందం కలిగిస్తోంది.

– ఇర్ఫాన్, ఆర్మీ జవాను



క్యాంటీన్‌కు వచ్చిన కస్టమర్లకు వడ్డిస్తున్న మహిళా సంఘం సభ్యురాలు

మహిళా శక్తి క్యాంటిన్

పరిగి: మహిళలు సంఘంగా ఏర్పడి స్వయం ఉపాధి రంగంలో రాణిస్తున్నారు. ఐకేపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా శక్తి క్యాంటిన్ ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. పరిగి మండలం చిట్యాల గ్రామానికి చెందిన బతుకమ్మ మరో నలుగురు కలిసి మహిళా సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మహిళా శక్తి పేరిట క్యాంటిన్ నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో క్యాంటిన్ ఏర్పాటు చేశారు. వీరికి మండల సమాఖ్య రూ.3 లక్షల రుణం అందించి అండగా నిలిచింది. రెండు నెలల్లో వ్యాపారం అభివృద్ధి చెందింది. నిత్యం రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు సంఘం అధ్యక్షురాలు సంతోష తెలిపారు. రుచికి, శుచికి మహిళా శక్తి క్యాంటిన్ కేరాఫ్‌గా మారింది. దీంతో ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు సంకల్పించింది.

ఆ ఊరిలో 60మంది..



సంక్రాంతి పండుగకు వచ్చిన ఆర్మీ ఉద్యోగులను సన్మానిస్తున్న పరిగి డీఎస్పీ శ్రీనివాస్

కుల్కచర్ల: బండవెల్కిచర్ల.. కుల్కచర్ల మండలంలోని ఓ చిన్న గ్రామం.. కానీ దేశ రక్షణలో మాత్రం గ్రామం పాత్ర ఘనం.. దాదాపు 60 మంది ఆర్మీలో చేరి వివిధ కేటగిరీలలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని ప్రతి యువకుడి అడుగులు ఆర్మీ వైపే పడతాయి. దేశ రక్షణే కాదు.. జన్మనిచ్చిన ఊరికీ సేవ చేస్తుంటారు. పండుగల సమయంలో గ్రామాలకు వచ్చే సైనికులు యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తుంటారు.. సంక్రాంతి పండుగకు వచ్చిన ఆర్మీ ఉద్యోగులను పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు.

భారత్ – చైనా సరిహద్దులో..

పక్క ఫొటోలో కనిపిస్తున్న జెట్టూరి అంజిలయ్య భారత్ – చైనా సరిహద్దులోని నాథుల బార్డర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆర్మీలో ఉద్యోగం చేయడం గొప్ప వరమని భావిస్తున్నట్లు తెలిపాడు. దేశ సేవ చేయడం అందరికీ రాదని.. తనకు రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.



భారత్ – చైనా సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్న జెట్టూరి అంజిలయ్య



కాంగో దేశంలో వైద్య సేవలు అందిస్తున్న శ్రీనివాస్

ఐక్యరాజ్యసమితిలో ప్రాతినిధ్యం

భారత ఆర్మీలో ఉద్యోగం పొందిన బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన అన్నసారం శ్రీనివాస్ ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో వివిధ దేశాల్లో పేద ప్రజలకు వైద్య సేవలు అందించారు. ముఖ్యంగా భూకంపాలు, వరదలు, ప్రకృతి విపత్తులు వచ్చిన సందర్భంలో ఐక్యరాజ్యసమితి తరఫున వైద్యం చేశారు.



దుక్కి దున్నుతున్న ఝాన్సీలక్ష్మీబాయి

సేంద్రియ సాగులో రాణి

తాండూరు: మూడేళ్ల క్రితం వరకు ఆమె సాధారణ గృహిణే.. ఒక్కసారిగా రైతుగా మారి సేంద్రియ సాగుతో ప్రకృతి వ్యవసాయం మొదలు పెట్టింది. తాండూరు పట్టణ శివారులో 2.38 ఎకరాల వ్యవసాయ పొలాన్ని కొనుగోలు చేసి డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేస్తూ రూ.లక్షలు ఆర్జిస్తూ తోటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది ఝాన్సీలక్ష్మీబాయి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతికి చెందిన గొండి ఝాన్సీలక్ష్మీబాయి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తల్లిదండ్రులు పద్మావతి చెంగవనాయుడు రైతు ఆధారిత కుటుంబం కావడంతో చిన్ననాటి నుంచే వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నారు. భర్త రామకృష్ణనాయుడు వ్యాపారంలో స్థిరపడ్డారు. మూడేళ్ల క్రితం సహజ సిద్ధంగా లభించే ఎరువులతో ప్రకృతి వ్యవసాయం చేయాలని సంకల్పించారు. అనుకున్నదే తడవుగా తాండూరు మండలం వీర్‌శెట్టిపల్లి సమీపంలో వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. అందులో డ్రాగన్ ఫ్రూట్ పంటను సాగుచేసి దిగుబడిని వికారాబాద్‌తో పాటు హైదరాబాద్, విజయవాడ, విశాఖ పట్నం, గుంటూరు, తిరుపతి, చెన్నై లాంటి పట్టణాలకు ఆర్టీసీ కార్గో ద్వారా సరఫరా చేస్తోంది.



నాలుగు పథకాలకు శ్రీకారం నేడు

- పక్కాగా ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఆదివారం ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాలుగు సంక్షేమ పథకాల అమలు కోసం చేపట్టాల్సిన చర్యల గురించి తెలియజేశారు. అనంతరం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎంపిక చేసిన గ్రామాల్లో పథకాల ప్రారంభోత్సవంలో ఎలాంటి తప్పిదాలు, గందరగోళానికి తావు లేకుండా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి మధ్యాహ్నం ఒంటి గంటకు పథకాల అమలుకు శ్రీకారం చుట్టాలన్నారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన వీడియోను ప్రదర్శించాలన్నారు. ఒక్కో పథకానికి ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆహార భద్రత కార్డులకు తహసీల్దార్, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపీడీఓ, రైతు భరోసాకు మండల వ్యవసాయ అధికారి, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీ పథకం ఏపీఓ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు ఇన్‌చార్జిలుగా వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జాబితాలో వంద శాతం అర్హులు మాత్రమే ఉండేలా చూసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూపాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సుధీర్, లింగ్యా నాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డీఆర్‌డీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధంతో సమానం

అనంతగిరి: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధంతో సమానమని.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. 85 సంవత్సరాల నుంచి ఓటు హక్కు వినియోగించుకుంటున్న సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

సాగు భూమికే రైతు భరోసా

- ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తాం
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా పథకం అమలవుతుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం మోమిన్‌పేట రైతు వేదికలో 42 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. అనంతరం రూ.1.40 కోట్లతో నిర్మించిన పీఏసీఎస్ నూతన కార్యాలయం, గోదాంను ప్రారంభించారు. మల్లారెడ్డి గూడెం, చక్రంపల్లి గ్రామాల్లో రూ.20 లక్షల చొప్పున వెచ్చించి నిర్మించనున్న పంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతు భరోసా డబ్బు అన్నదాతల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందన్నారు. పదేళ్లుగా పేదలకు సొంతింటి కోసం, రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం వారి కలను సాకారం చేస్తోందని తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలను నేటి నుంచి అమలు చేయనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరైనట్లు వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ సత్యయ్య, డైరెక్టర్ అంజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మార్కెటు కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, డీసీఏ నాగలింగాచారి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీడీఓ విజయలక్ష్మి, సీఈఓ శేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పరేడ్‌లో కళాకారుల నృత్య ప్రదర్శన

తాండూరు టౌన్: గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలో ఆదివారం నిర్వహించనున్న రిపబ్లిక్ డే పరేడ్‌లో కళాకారులు నృత్య ప్రదర్శన ఇవ్వనున్నట్లు డ్యాన్స్ మాస్టర్ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జానపద కళారూపం గరగ నృత్యాన్ని జిల్లాకు చెందిన 12 మంది కళాకారులు ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఈ బృందానికి అంతర్జాతీయ గరగ నృత్య కళా గురువు కేవైవి ప్రసాద్ ప్రాతినిథ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని జంతువుల దాడిలో జింక మృతి


జింక కలేబరం

దోమ: గుర్తు తెలియని జంతువుల దాడిలో జింక మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... దోమ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాన్‌సింగ్ పొలంలో శనివారం రక్తపుమడుగులో జింక మృతి చెంది ఉండడాన్ని గమనించారు. వెంటనే ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు తెలిపారు. విషయం తెలుసుకున్న అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. జింక మృతికి చిరుత? లేదా హైనా? ఉండొచ్చని చుట్టుప్రక్కల ప్రాంతాల రైతులు భయానికి గురవుతున్నారు.

ఎల్మకన్నెలో దొంగల భయం..!

పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని వేడుకోలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఎల్మకన్నె గ్రామంలో గ్రామస్తులకు దొంగల భయం పట్టుకుంది. కొన్ని రోజుల క్రితం ఎల్మకన్నె గ్రామ సమీపంలోని కోనాపూర్ గ్రామంలో నాలుగు ఇళ్లల్లో దొంగలు పడ్డారు. అయితే కర్ణాటక రాష్ట్రం బాల్కికి చెందిన దొంగల ముఠా అని పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరాల్లో కూడా వారి దృశ్యాలు రికార్డు అవ్వడంతో దొంగలను పట్టుకునే పనిలో ఉన్నారు. గత రెండు, మూడు రోజుల నుంచి ఎల్మకన్నె గ్రామంలో రాత్రి సమయంలో ఇంటి తలుపులు కొడుతున్నారని గ్రామస్తులు భయందోళన చెందుతున్నారు. మూతికి గుడ్డలు కట్టుకొని ముఠాగా తిరుగుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయాన్ని పోలీసులు గమనించి ఎల్మకన్నె గ్రామంలో రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.

నూతన కమిటీ నియామకం

షాద్‌నగర్: ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ్మ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధి మొగిలిగిద్ద గ్రామంలో సమితి నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆవుల రవి, అధికార ప్రతినిధిగా మన్మర్రి జంగయ్య, ఉపాధ్యక్షుడిగా శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా అరుణ్, కార్యదర్శిగా విజయ్‌కుమార్, కోశాధికారిగా రామయ్య, ప్రచార కార్యదర్శిగా ప్రశాంత్, గౌరవ అధ్యక్షులుగా రాములు, సురేందర్, గౌరవ సలహాదారులుగా యాదయ్య, సురేందర్, నర్సింహులు, జంగయ్య, పాండు, నర్సింహులు, శంకరయ్య, యాదయ్యలను నియమించారు. నూతన కమిటీ సభ్యులకు సమితి జిల్లా అధ్యక్షుడు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, సాయికుమార్, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంతా ప్రశాంతమే..

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో సాగిన సమావేశం
- ప్రశ్నల వర్షం కురిపించిన ప్రతిపక్ష కౌన్సిలర్లు
- ఆమోదం పొందని మూడు అంశాలు


కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే, చైర్‌పర్సన్లు

తాండూరు: తాండూరు మున్సిపల్ అభివృద్ధే ధ్యేయమని, వ్యక్తిగత దూషణలకు కౌన్సిల్ సమావేశం వేదిక కారాదని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ తాటి కొండస్వప్న అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో సాగింది. నాలుగున్నర గంటల పాటు సుదీర్ఘంగా సాగిన కౌన్సిల్ సమావేశంలో ప్రతి కౌన్సిలర్‌కు మాట్లాడే అవకాశం కల్పించారు. అయితే 38 అంశాల ఎజెండాను కౌన్సిల్‌లో ప్రవేశపెట్టగ 2, 18, 21 అంశాలపై ప్రతిపక్ష కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మూడు అంశాలు ఆమోదం పొందలేదు. 27వ అంశాన్ని మాత్రం సవరించాలని కౌన్సిలర్లు కోరారు. మొత్తం రూ.3.80 కోట్ల నిధులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఒక్కో అంశంపై చర్చిస్తున్న సమయంలో 11వ వార్డు కౌన్సిలర్ నీరజాబాల్‌రెడ్డికి, 13వ వార్డు కౌన్సిలర్‌కు మధ్య వాగ్వివాదం జరిగింది. బీఆర్ఎస్ కౌన్సిలర్లు గతంలో ఎమ్మెల్యేగా ఉన్న రోహిత్ రెడ్డి ప్రతి వార్డుకు రూ.1కోటి నిధులు మంజూరు చేయించారంటూ ప్రస్తావించారు. ఈ విషయమై అధికార పార్టీ కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదంటూ ఎదురు దాడికి దిగారు. నాలుగేళ్లుగా గొడవలతో కౌన్సిల్ సాగిందని, కౌన్సిల్ హాల్లో వార్డుల అభివృద్ధికి చర్చించాలని ఇలా వ్యక్తిగత ఆరోపణలు చేసుకోవడం సరికాదంటూ చురకలు అంటించారు. ప్రతిపక్ష కౌన్సిలర్లు చర్చించేందుకు ఎక్కువ సమయం ఇస్తున్న సమావేశంలో రచ్చ చేయడం సరికాదంటూ అసహనం వ్యక్తం చేశారు. అనంతరం కౌన్సిల్‌లో ప్రతి కౌన్సిలర్‌కు మాట్లాడే అవకాశం కల్పించారు. సాయంత్రం 4.30 గంటలకు సమావేశం ముగిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. దీంతో ఇంకా తమకు మాట్లాడే అవకాశం కల్పించలేదంటూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాల్ ఎదుట బైటాయించారు. చర్చలు, ప్రశ్నల వర్షంతో ఎలాంటి గొడవలు లేకుండా చివరి కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పట్లోళ్ల దీపనర్సింహులు, కమిషనర్ విక్రంసింహారెడ్డి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు రత్నమాల నర్సింహులు, పూజ, నీరజాబాల్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, వరాల శ్రీనివాస్‌రెడ్డి, అంతారం లలిత, సాహు శ్రీలత, సాజిద్ అలీ, సల్మాఫాతిమా, అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

పరిగి చుట్టూ ఔటర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

- పర్యాటక ప్రాంతంగా లక్నాపూర్ ప్రాజెక్టు
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి వెల్లడి
- మున్సిపల్ పాలక వర్గానికి ఆత్మీయ వీడ్కోలు

పరిగి: పరిగి చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేసి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రథమ కౌన్సిల్ సభ్యుల ఆత్మీయ వీడ్కోలు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా పట్టణాన్ని అభివృద్ధి చేశామన్నారు. రాష్ట్రంలోనే అతి తక్కువ పొల్యూషన్ ఉన్న పట్టణంగా పరిగికి పేరుందన్నారు. మున్సిపాలిటీ విస్తీర్ణాన్ని పెంచేందుకు సమీప గ్రామాలను విలీనం చేశామని తెలిపారు. వ్యాపార సముదాయాలు వచ్చే విధంగా ఈ ప్రాంతాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దామన్నారు. లక్నాపూర్ ప్రాజెక్టును టూరిజం స్పాట్‌గా రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రసన్నలక్ష్మి, కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు రవీందర్, అర్చన, కిరన్, కృష్ణ, మునీర్, రియాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ పాలకవర్గంతో ఎమ్మెల్యే టీఆర్ఆర్

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైంది


పరిగి: ర్యాలీలో ఎమ్మెల్యే టీఆర్ఆర్ తదితరులు


తాండూరు రూరల్: సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ప్రజా స్వామ్యంలో ఓటు విలువైందని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి గాంధీ చౌక్ వరకు విద్యార్థులచే ఓటుహక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును నిజాయితిగా వినియోగించుకున్నప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సిద్ధిస్తుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఆర్డీఓ విజయ కుమారి సూచించారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: ఓటుతో సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవచ్చని తాండూరు డివిజన్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తాండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశమని ప్రతీ పౌరుడికి ఓటు వేసే ప్రాథమిక హక్కు ఉందన్నారు. అనంతరం ప్రతి ఎన్నికల్లో తప్ప నిసరిగా ఓటుహక్కు వినియోగించుకుంటున్న సీనియర్ సిటిజన్స్‌ను శాలువ కప్పి, పూలమాల వేసి సన్మానించారు. బీఎల్ఓలకు సర్టిఫికెట్ అందజేసి ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దార్ కేతావత్ తారాసింగ్, ఎంపీఓ ఆనంద్‌రావు, ఏపీఎం నరోత్తంరెడ్డి, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

నేడు తిమ్మాయిపల్లికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామానికి ఆదివారం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి రానున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి తెలిపారు. కొత్తగా మంజూరైన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని పేర్కొన్నారు. నాయకులు, ప్రజాప్రతినిధులు మధ్యాహ్నం ఒంటిగంటకు హాజరు కావాలని కోరారు.

వివాహిత అదృశ్యం


గీత (ఫైల్)

కుల్కచర్ల: ఆసుపత్రికి వెళ్లిన వివాహిత అదృశ్యమైన ఘటన కుల్కచర్ల పోలిస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని మందిపల్ గ్రామానికి చెందిన షేక్ పల్లి గీత(27) 23వ తేదీన ఉదయం 11గంటల ప్రాంతంలో తన కుటుంబీకులతో కుల్కచర్లలోని ఆసుపత్రికి వెళ్లివస్తానని చెప్పి తిరిగిరాలేదు. కూలీ పనులకు వెళ్లొచ్చిన భర్త కావలి అంజయ్య సాయంత్రం ఇంట్లో చూసేసరికి ఆమె కనిపించలేదు. దీంతో భర్త చుట్టుప్రక్కల ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. తెలిసిన వాళ్ల దగ్గర వెతికినా కనిపించలేదు. దీంతో ఆయన శనివారం కుల్కచర్ల పోలిస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అన్వేష్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

షాద్‌నగర్‌రూరల్: రైలుకింద పడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన శనివారం రాత్రి పట్టణంలోని కేశంపేట రైల్వేగేటు వద్ద చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహిళ(25) విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి, తీవ్ర గాయాలతో మృతి చెందింది. మృతురాలి ఒంటిపై మెరూన్, బ్లాక్ కలర్ పంజాబీ డ్రస్ ఉంది. ఆమె వివరాలు తెలిసినా, ఆచూకీ లభించినా 9848090426 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని, స్టేషన్ మాస్టర్ ఠాగూర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పారిశ్రామిక వాడకు భూములిస్తాం


కలెక్టర్‌కు అంగీకార పత్రాలు అందజేస్తున్న రైతులు

- కలెక్టర్‌కు అంగీకర పత్రాలు అందజేసిన లగచర్ల రైతులు
- 30 మంది 40 ఎకరాలు అందజేత
- భూముల ఊసెత్తని గిరిజన తండా వాసులు

దుద్యాల్: పారిశ్రామిక వాడ ఏర్పాటును తొలుత తీవ్రంగా వ్యతిరేకించిన రైతులు.. ప్రస్తుతం స్వాగతిస్తున్నారు. అందుకు భూములు ఇచ్చేందుకు సైతం ముందుకు వస్తున్నారు. శనివారం మండల పరిధి లగచర్ల గ్రామ రైతులు కొందరు కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు కలిసి అంగీకార పత్రాలు అందజేశారు.

మరింత మంది..

లగచర్ల గ్రామానికి చెందిన 102 సర్వే నంబర్‌లో 20 మంది రైతులకు సంబంధించిన 30 ఎకరాల అసైన్డ్ భూమి, 5గురు రైతులకు చెందిన 10 ఎకరాల పట్టా భూములకు అంగీకార పత్రాలను ఇచ్చినట్లు తెలిపారు. ఇది వరకే గ్రామానికి చెందిన కొంత మంది రైతులు కలెక్టర్‌కు భూముల పత్రాలు అందజేశారు. పోలెపల్లి గ్రామానికి చెందిన రైతులు 71.39 ఎకరాల భూముని ఇచ్చారు. వీరితో పాటు చాలా మంది రైతులు భూములు ఇచ్చేందుకు సుముఖత చూపుతున్నట్లు సమాచారం. రెతుల వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్ రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు శీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, యుగందర్ రెడ్డి, అనంతయ్య, రాంరెడ్డి, నర్సింహులు గౌడ్ అనంత రెడ్డి, మాదారం అనంతయ్య ఉన్నారు.

ముందుకు రాని లగచర్ల రైతులు

పారిశ్రామిక వాడ ఏర్పాటుకు రైతులు భూములు ఇస్తామని ముందుకు వస్తున్నారు. అందుకు పోలెపల్లి, లగచర్ల, హకీంపేట్ గ్రామాలకు చెందిన రైతులు విడతల వారీగా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలుస్తూ అంగీకార పత్రాలు అందజేస్తున్నారు. కాని.. లగచర్ల గ్రామ రైతులు కొందరు భూములు ఇచ్చేందుకు సుముఖత చూపడం లేదు. అదే బాటలో రోటిబండతండా, పులిచర్లకుంటతండా వాసులు ప్రభుత్వానికి సంకేతాలు ఇస్తున్నట్లు సమాచారం. అధికారులు కూడా ఆ గ్రామాలకు చెందిన రైతుల భూముల సర్వేలు చేయడం లేదు. అయిష్టత చూపుతున్న గిరిజనలు త్వరలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని చూడాలి మరి.

పల్లెల్లో పబ్లిక్ లైబ్రరీలు

గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శేరి రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాన పబ్లిక్ లైబ్రరీలు ఏర్పాటు చేయనున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధి నాందార్‌పూర్ ఉన్నత పాఠశాలలో యూత్ ఫర్ సేవ కార్యక్రమాలు, పలు ఉచిత అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. సంస్థ ద్వారా గ్రంథాలయాలకు నూతన భవనాలు ఏర్పాటు చేసే అవకాశం లేదని, పబ్లిక్ లైబ్రరీలు ఏర్పాటు చేసుకోవచ్చునని చెప్పారు. వీటిని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవచ్చునని చెప్పారు.

కొత్త భవనాలు!

1992లో కొడంగల్, పరిగి, తాండూరు పట్టణాల్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాల అభివృద్ధికి, 1965లో జిల్లా కేంద్రం ఏర్పాటు చేసిన లైబ్రరీకి నూతన భవనాలు నిర్మించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు. నిత్యం 600 వరకు పాఠకులు వచ్చే లైబ్రరీకి త్వరలో నూతన భవనం మంజూరు కావచ్చన్నారు.

రూ.3.5 లక్షలతో యూత్ ఫర్‌సేవ పనులు

నాందర్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో యూత్ ఫర్ సేవ, స్టే స్ట్రీట్ సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా రూ.3.70 లక్షలతో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు, డిజిట్ టీవీ, జారుడు బల్లా, ఉయ్యాలలు, ఆట వస్తువులు తదితర సామగ్రిని అందజేశారు. వీటిని శేరి రాజేశ్ రెడ్డి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రవీంద్ర మాదవ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు హరిలాల్, రాంరెడ్డి, హెచ్ఎం రామయ్య, పాఠశాల కమిటీ చేసిన కృషికి తెలంగాణ విద్యావంతుల వేదిక అభినందించింది. టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మల్లేశ్, నర్సింహులు గౌడ్ పాల్గొన్నారు.

జెండా వందనానికి కలెక్టరేట్ ముస్తాబు


విద్యుత్ దీపాలతో ముస్తాబైన కలెక్టరేట్ సముదాయం

కలెక్టర్ కార్యాలయం గణతంత్ర వేడుకలకు ముస్తాబైంది. ఆదివారం ఉదయం 9గంటలకు కలెక్టర్ ప్రతీక్ జైన్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత సంబరాల్లో పాల్గొననున్నారు. – అనంతగిరి

అధికారికంగా పథకాల ప్రారంభం


పెండ్లిముడుగులో ఏర్పాట్లను సమీక్షిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ తదితరులు

మండలానికి ఒక్కో గ్రామం చొప్పున ఎంపిక

అనంతగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నాలుగు పథకాలను ఆదివారం నుంచి అమలులోకి తీసుకురానుంది. ఇందులో భాగంగా ఆదివారం మండలానికి ఒక్కో గ్రామం చొప్పున ఎంపిక చేసి ఆదివారం లాంఛనంగా ఈ కార్యక్రామాన్ని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పెండ్లిమడుగు, అవుసులపల్లి, గుండ్లమర్పల్లి, బాల్‌రెడ్డిగూడ, కంకణాలపల్లి, నాగవరం, మంచన్‌పల్లి, నస్కల్, ముజాహిద్‌పూర్, శివారెడ్డిపల్లి, మక్తావెంకటపూర్, చెన్‌గేష్‌పూర్, ఖాసీంపూర్, మంబాపూర్, తిమ్మాయిపల్లి, అన్నారం, నాగిరెడ్డిపల్లి, సంగాయిపల్లి, నందారం, దాతాపూర్ గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పథకాలను ప్రారంభిస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శనివారం అధికారులు సమీక్షించారు.

జేబుదొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలి


బొంరాస్‌పేట: పోగొట్టుకున్న మొబైల్‌ను అప్పగిస్తున్న ఎస్ఐ రవూఫ్


కొడంగల్ రూరల్: బాధితులకు ఫోన్లు అందిస్తున్న ఎస్ఐ జివి సత్యనారాయణ

పోగొట్టుకున్న మొబైల్ అందజేత

బొంరాస్‌పేట: ప్రయాణికులు జేబుదొంగలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎండీ రవూఫ్ సూచించారు. పోగొట్టుకున్న మొబైల్‌ను ఈసీఐఎల్ టెక్నాలజీతో తిరిగి అప్పగించారు. శనివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితుడు మేడిగడ్డ తండాకు చెందిన ముడావత్ గణేశ్‌కు పిలిపించి అందజేశారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుగొని తిరిగి బాధితులకు అందించారు. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన మహేష్, కోస్గి మండలంలోని నాచారం గ్రామానికి చెందిన టీ సురేష్ తమ ఫోన్లు పోయినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో ట్రాక్ చేసి ఫోన్లను రికవరీ చేశారు. పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో ఎస్ఐ జివి.సత్యనారాయణ ఫోన్లను అందజేశారు.

సంక్షేమానికి సై


ధారూరు: అల్లిపూర్‌లో దరఖాస్తు చేసేందుకు ఎగబడుతున్న ప్రజలు

- నేటి నుంచే పథకాల అమలు
- 23,542 కుటుంబాలకు రేషన్ కార్డులు
- 5,90,009 ఎకరాలకు రైతు భరోసా
- 22 వేల మంది వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా
- ఇందిరమ్మ ఇళ్ల అర్హులు 1,48,663 మంది

వికారాబాద్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యింది. గ్రామ, వార్డు సభల్లో వీటికి ఆమోదం లభించడంతో గణతంత్ర దినోత్సవం సందర్భంగా వీటిని పేదలకు అందించేందుకు యంత్రాంగం సిద్ధమైంది. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం గతంలో ఎక్కువ దరఖాస్తులు రాగా అర్హుల జాబితాలోనూ వీటికి సంబంధించిన వారే ఎక్కువ మంది ఉన్నారు. దీంతో తర్వాతి జాబితాలోనైనా తమకు చోటు దక్కుతుందా..? లేదా..? అని దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు అధికం

ఇళ్లు లేని పేదల కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని భావిస్తుండగా.. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించారు. ఈ లెక్కన జిల్లాలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లలో కలిసి మొత్తం 14 వేల గృహాలను నిర్మించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇందుకు సంబంధించి 2.57 లక్షల దరఖాస్తులు రాగా, వీరిలో 1,48,663 మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో 54,806 మందికి ఇల్లుతో పాటు ఇంటి స్థలం కూడా లేదని నిర్ధారించారు. వ్యవసాయ భూమి లేని కూలీల కుటుంబాలకు రూ.6 వేల చొప్పున రెండు విడతల్లో ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించగా 22 వేల మంది ఈ పథకానికి ఎంపికయ్యారు.

23,542 మందికి రేషన్ కార్డులు

చాలా కాలంగా కొత్త రేషన్ కార్డులతో పాటు ఉన్న కార్డులలో సభ్యుల పేర్లు చేర్పించేందుకు వేల సంఖ్యలో పేదలు ఎదురు చూస్తున్నారు. తాజాగా ఎంపిక చేసిన జాబితాలో 23,542 మందిని అర్హులుగా గుర్తించారు. వీరితో పాటు మరో 58,986 మంది కుటుంబ సభ్యులను ఇప్పటికే ఉన్న రేషన్ కార్డులలో చేర్చాలని నిర్ణయించారు. గతంలో జిల్లాలోని 2,68,107 మందికి రైతుబంధు పథకం కింద ఏటా రూ.10 వేల చొప్పున సాగు సాయం అందజేశారు. రెండు విడతల్లో ఒక్కో పంటకు రూ.308 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా ఇస్తామని, ఎకరాకు రూ.6 వేల చొప్పున రెండు విడతల్లో రూ.12 వేలు అందజేస్తామని ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా సర్వే నిర్వహించి జిల్లాలో 7,496 ఎకరాల భూమి సాగుకు యోగ్యం కాదని తేల్చింది. 5,90,009 ఎకరాలకు సంబంధించిన అర్హుల జాబితా రూపొందించి, నగదు వేసేందుకు సిద్ధమైంది.

సైట్ క్లోజ్ సమస్యలు..

ధారూరు: గతేడాది జరిగిన ప్రజా పాలన గ్రామ సభల్లో గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తులు పెట్టుకున్నా ఇప్పటి వరకూ అమలు కాలేదని పలువురు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, ప్రస్తుత ప్రజా పాలన గ్రామ సభల్లో ఆందోళన చేపట్టారు. పలువురి వివరాలను కంప్యూటర్ ఆపరేటర్లు తప్పుగా నమోదు చేయడంతో ఎడిట్ ఆప్షన్ లేక బాధితులు నష్టపోతున్నారు. ప్రస్తుతం సదరు సైట్‌ను కూడా క్లోజ్ చేశారు. ఈ విషయమై అనేక గ్రామ, వార్డు సభల్లో ప్రజలు ఆందోళన వ్యక్తం చేయగా.. ప్రభుత్వానికి నివేదిక పంపించామని అధికారులు సర్దిచెప్పారు.